## కామెడీ కథ

కోలపల్లి ఈశ్వర్

# ప్రేతకళ వచ్చేసిందే బాలా!

ఆమె పేరు బాలాత్రిపురసుందరి.

పేరు పాతచింతకాయ పచ్చడే. అయితేనేం మనిషి మహా అందగత్తె. 'మహా' పక్కన మరో 'మహా' చేర్చినా తప్పులేదు.

అంత అందగత్తె.

ప్రస్తుతం డిగ్రీ సెకండియర్ చదువుతోందామె. అడ్వకేట్ నారాయణరావుగారి ఏకైక పుత్రిక.

అతని పేరు మనోజ్! ఎత్తు అయిదడుగుల పదంగుళాలు. చాలా స్మార్ట్‌గా ఉంటాడు. నార్త్ ఇండియన్ టైప్‌లో క్లీన్ షేవ్ చేసుకుని, హిందీ సినిమా హీరోలా మిలమిలా మెరిసిపోతుంటాడు. ప్రస్తుతం ఎమ్మెస్సీ ఫైనలియర్ చదువుతున్నాడతను. ఉండేది నారాయణరావు గారి ఎదురింట్లోనే. హాస్టల్లో ఉంటే చదువు సరిగ్గా సాగదని, ఖర్చుకి వెనుకాడకుండా ఆ ఇల్లు అద్దెకు తీసుకుని అందులో ఒంటరిగా ఉంటున్నాడు. కావాలంటే ఒకర్నో, ఇద్దర్నో రూమ్మేట్స్‌గా చేర్చుకోవచ్చు. కానీ అది కూడా చదువుకి చెరుపే అన్న ఉద్దేశంతో వెయ్యి రూపాయల రెంటు ఒక్కడే భరిస్తున్నాడు.

చదువు మీద అతనికి అంత శ్రద్ధ.

చదువు మీద శ్రద్ధ ఉన్నంత మాత్రాన, చక్కనైన చిన్నదాన్ని చూసినప్పుడు మనసు చెదరకూడదని రూలేం లేదు కదా!

బాలాత్రిపురసుందరి అందానికి సహజంగానే అతని మనసు చెదిరింది.

అబ్బ! ఎంత అందగత్తె.

ఆ అందాన్ని స్వంతం చేసుకుంటేనే కదా జన్మ ధన్యం!

లేకపోతే వృధా కదా!

ఆమెని చూసినప్పుడల్లా అలాగే అనిపిస్తూ ఉంటుంది అతనికి. వయసు ప్రభావం మరి!

అది ప్రేమన్న మాటేగా!

ఒక లక్షా డెబ్బై రెండు వేల ఆరొందల తొంబై నాలుగుసార్లు అలా అనిపించాక తానామెను ప్రేమిస్తున్నాడన్న నగ్నసత్యం అతనికి బోధపడింది.

తాను ప్రేమిస్తున్నాడు సరే- కానీ ఆమె కూడా తనని ప్రేమించాలి గదా!

అప్పుడేగా కథ రక్తికట్టి పాకాన పడేది.

అలా అనిపించాక ఆమె కనిపించినప్పుడల్లా ఆమె కేసి ప్రేమగా చూడ్డం ప్రారంభించాడు మనోజ్.

కానీ ఆమె అతని ప్రేమ చూపుల్ని ప్రేమగా రిసీవ్ చేసుకునేది కాదు. అతన్ని చూడగానే ముఖం తిప్పేసుకునేది.

ఎందుకని ఆమె అలా ప్రవర్తిస్తోంది? తను చాలా స్మార్ట్‌గా, హ్యాండ్సమ్‌గా ఉంటాడు. తన క్లాస్‌మేట్స్ కూడా ఇదే మాట అంటూ ఉంటారు. నీరజ, రాగిణి, వసుంధర లాంటి క్లాస్‌మేట్స్ తనకేసి ఆరాధనగా కూడా చూస్తుంటారు.

అలాంటిది తానామెను ఎందుకాకర్షించలేకపోతున్నాడు?

తనని చూడగానే ఆమె ఎందుకలా ముఖం తిప్పేసుకుంటోంది?

ఎంతగా ఆలోచించినా ఆ ప్రశ్నకు సమాధానం దొరకలేదు.

తనకి అందం ఉంది. చదువుంది. తానొక శ్రీమంతుడన్న విషయం వేరే చెప్పనవసరం లేదు. తను ధరించే ఖరీదైన డ్రెస్సులూ, రేబాన్ కళ్లజోడూ, ఉడ్‌లాండ్ షూసూ, ఇంపోర్టెడ్ రిస్ట్‌వాచీ ఇవన్నీ చెప్పకనే చెబుతాయి తానొక స్థితిమంతుడని. తన వాహనం మాత్రం తక్కువదా? కైనెటిక్ హోండా!

ఐనాసరే తానా అమ్మాయిని ఆకర్షించలేకపోవడం ఏంటి?

'దేర్ మస్ట్ బి సమ్‌థింగ్ బిహైండ్ ఇట్' అనుకుని, ఆ 'సమ్‌థింగ్' ఏంటో తేల్చేసుకోవాలని కూడా అనుకుని, ఓ ఫైన్ మార్నింగ్ అతనామెను కలవాలనుకుని, వద్దులెమ్మనుకుని - ఓ ఉత్తరం రాశాడు.

"బాలాత్రిపురసుందరిగారికి

నేను మిమ్మల్ని మనసారా ప్రేమిస్తున్నాను. మీరు 'ఊ' అంటే, మీ పెద్దలతో మాట్లాడి మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. కానీ, మీరెందుకో నన్ను చూసినప్పుడల్లా ముఖం తిప్పేసుకుంటున్నారు. ఇది నాకు చాలా బాధ కలిగిస్తోంది. మీరు లేని ఈ జీవితం వృధా అన్న నిర్ణయానికి నేనెప్పుడో వచ్చేశాను. కనుక ఈ దీనుడికి ప్రేమభిక్ష ప్రసాదించి ప్రాణాలు నిలపవలసిందిగా అర్థిస్తున్నాను"

వగైరా వగైరా అంశాలతో ముగిసిందా ఉత్తరం.

* * *

"పాపం! ఎంతో దీనంగా రాశాడు! పోనీ ప్రేమించవే! పాపం.. ఎదురింటబ్బాయ్" అంది సుప్రియ, బాలత్రిపురసుందరి తనకందించిన ఉత్తరాన్ని తిరిగి ఆమెకిచ్చేస్తూ.

"ఏదో ప్రాణస్నేహితురాలివి కదాని ఆ స్కౌండ్రల్ రాసిన ఉత్తరాన్ని నీకిస్తే అతన్ని ప్రేమించమని దిక్కుమాలిన సలహా ఇస్తావా? నీకసలు బుద్ధుందా?" బాలాత్రిపురసుందరి కోపంగా అంది.

"బుద్ధి లేకపోవడానికి ఇదేమన్నా తప్పుడు సలహానా ఏంటి? నాకే గనక అలాంటి కుర్రాడు లవ్‌లెటర్ రాస్తే ఎగిరి గంతేసి మరీ ఒప్పుకుంటాను. అతనికేం తక్కువని? షారుక్ ఖాన్, ధోనీ, సల్మాన్‌ఖాన్, సైఫ్ అలీ ఖాన్... వీళ్లెవరూ అందంలో అతని కాలిగోటికిక్కూడా సరిపోరు తెలుసా?"

"చాల్లే నోర్ముయ్! 'ఛూ' అదీ ఒక అందమేనా?" అంటూ చేతిలోని ఉత్తరాన్ని చిన్న చిన్న ముక్కలుగా చింపేసి గాల్లోకి విసిరేసింది చిరాగ్గా బాలాత్రిపురసుందరి.

ఆ సమయంలో వాళ్లిద్దరూ డాబా మీద ఉన్నారు.

ఆ ఉత్తరం ముక్కల్లో కొన్ని గాల్లో పల్టీలు కొడుతూ ఎగిరెళ్లి ఎదురింటి వరండా మీద నిలబడి ఉన్న మనోజ్ కాళ్ల దగ్గర పడ్డాయి.

అతను వాటిని చూడగానే గుర్తుపట్టేశాడు. అవి తన ఉత్తరం తాలూకు ముక్కలని.

మనసు ముక్కలైపోతున్నట్టే అనిపించింది అతనికి.

భోరున ఏడవాలని కూడా అనిపించింది.

కానీ మగపుట్టుక పుట్టి ఏడ్వటం బాగుండదు కాబట్టి ఎలాగో అతికష్టమ్మీద నిగ్రహించుకున్నాడు.

* * *

"బాలాత్రిపురసుందరిగారికి,

నా ఉత్తరాన్ని ముక్కలు ముక్కలు చెయ్యడం ద్వారా నా మనసుని కూడా ముక్కలు ముక్కలు చేసేశారు మీరు! అయినా సరే, ఎప్పటికైనా మీ మనసును జయించగలనన్న ఆశాభావంతో ముక్కలైపోయిన నా మనసుని 'ఆశ' అనే 'అరల్‌డైట్'తో అతికించుకుని మళ్లీ మీకీ ఉత్తరం రాస్తున్నాను. నాకు మీ ప్రేమ కావాలి! దాని కోసం నేను నిరాహారదీక్ష చేయడానికైనా చివరికి ప్రాణాలు వదలడానికైనా సిద్ధమే!

ఈ క్షణం నుంచి మీరు నా ప్రేమని అంగీకరించే వరకూ నేను ఏమీ తినను. ఇది బెదిరింపు కాదు... నిజం....

నాకు ప్రేమ (ప్రాణ)భిక్ష ప్రసాదించరూ!

ఇట్లు మీ ప్రేమ కోసమై జీవిస్తున్న

-మనోజ్"

స్నేహితురాలు ఆ ఉత్తరాన్ని తన చేతికిచ్చి అదోలా నవ్వుతూంటే "ఛీ... మరీ ఇంత నిర్దయురాలివేంటే? నీ ప్రేమ కోసం అతను నిరాహారదీక్షక్కూడా సిద్ధపడుతున్నాడంటే- జాలితో కరిగిపోవాల్సింది పోయి వెటకారంగా నవ్వుతున్నావా?" అంది సుప్రియ కోపంగా!

"ఏడిశాల్లే! ఆ గొట్టంగాడు నిజంగా నిరాహారదీక్ష చేసినప్పుడు కదా! ఇదంతా ఉత్తుత్తి బెదిరింపే!" అనేసింది బాలాత్రిపురసుందరి తేలిగ్గా.

ఈ రెండో ఉత్తరానికి కూడా మొదటి ఉత్తరానికి పట్టిన గతే పట్టింది.

* * *

మర్నాడు-

ఒక అట్టమీద 'విజయవంతమైన 1వ రోజు' అని రాసి దాన్ని తన ఇంటి గేటుకి వేళ్లాడదీశాడు మనోజ్.

దాన్ని చూసి "పాపం" అంది సుప్రియ జాలిగా!

"పాపమా? పాడా? అంతా నాటకం" అనేసింది బాలాత్రిపురసుందరి - లోపలికెళ్లి తలుపేసుకుంటూ.

ఆ మర్నాడు -

క్రితం రోజు వేళ్లాడదీసిన బోర్డ్‌లోని 1ని 2గా మార్చాడు మనోజ్.

అది చూసి "పాపం" అంటూ మళ్లీ జాలిపడింది సుప్రియ.

"గాడిద గుడ్డేం కాదూ! అతను నిజంగానే నిరాహారదీక్ష చేస్తున్నాడని ఎవడికి



నమ్మకం?" జాలిపడకపోగా చాలా తేలిగ్గా అనేసింది బాలాత్రిపురసుందరి.

మూడోనాడు బోర్డ్‌లోని 2-3గా మారింది.

"కనికరం చూపవే!" అంది సుప్రియ.

కానీ, ఆమె హృదయం కరగలేదు. "ఇలాంటి పప్పులు మన దగ్గరేం ఉడకవ్.." అనేసింది నిర్ద్వంద్వంగా బాలాత్రిపురసుందరి.

నాలుగోనాడు బోర్డ్‌లోని 3- 4 అయ్యింది.

కానీ ఫలితం మాత్రం డిటోనే.

ఐదోనాడు బోర్డ్‌లోని నాలుగు అయిదయ్యింది.

"పాపం ఆకలితో చచ్చిపోతాడేమోనే.." అంది సుప్రియ తన సహజమైన జాలిగుణంతో!

"ఏం చావడు! మూడు పూటలా సుబ్బరంగా మెక్కుతూ ఆటలాడుతున్నాడు" అని నాలుక చప్పరించేసింది బాలాత్రిపురసుందరి నిర్లక్ష్యంగా ఆ బోర్డ్ వైపు చూస్తూ.

ఆ రోజు - విజయవంతమైన రోజు.

ఎప్పుడూ క్లీన్‌గా షేవ్ చేసుకుని మిలమిలా మెరిసిపోతూ ఉండే మనోజ్ గెడ్డమూ, మీసమూ పెంచుకుని ఓ పిచ్చివాడిలా కనిపించేసరికి సుప్రియ గుండె చెరువైపోయింది.

"చూడవే! పాపం! ప్రేతకళ వచ్చేసిందే బాలా అతని మొహంలో! ఇప్పటికైనా నువ్ కనికరించకపోతే పాపం అతను నిజంగానే చచ్చిపోయేలా ఉన్నాడు" అంది స్నేహితురాలితో.

"అది ప్రేతకళా? కాదు.. కానే కాదు" అంది బాలాత్రిపురసుందరి.

"మరి?"

"నేను కోరుకున్న హీరో కళ! నీకు తెలుసుగా గడ్డమూ, మీసాలూ ఉన్న హీరోలంటే నాకిష్టం. ఆ కోవలోకి చెందిన వారు రవితేజ, ఒకప్పుడు గెడ్డం చక్రవర్తి, పోకిరీ స్లిమ్ గడ్డంతో మహేష్‌బాబు, శ్రీరామదాసు నాగార్జున...అలాగన్నమాట... మరి మనోజ్ గతంలో ఎలా ఉండేవాడు... నున్నగా గొరుక్కుని, పేడి మూతిలాగా.. ఛా...యాక్. అసలు ఆ ముఖం చూస్తుంటేనే నాకు డోకొచ్చేది. మరిప్పుడు ఆ గడ్డంతో, మీసాల్తో ఎంత అందంగా ఉన్నాడో తెలుసా. నేను అతన్లో ఇప్పుడు ఓ మగాడిని చూడ
గ లంగ ంత ం
న్నాను...నౌ...నౌ... ఐ లవ్ హిమ్" అంది ఎదురింటి వరండా మీద శూన్యంలోకి చూస్తూ పిచ్చివాడిలా నిలబడి ఉన్న మనోజ్‌కేసి ఆరాధనగా చూస్తూ బాలాత్రిపురసుందరి.

"ని...ని..న్నిజంగా.." అంది సుప్రియ ఆశ్చర్యంగా.

"నీతో అబద్ధం ఆడాల్సిన పనేముందే? నిజంగానే నేనిప్పుడు అతన్ని ప్రేమిస్తున్నాను. రియల్లీ ఐ లవ్ హిమ్ నౌ" అంది ఆంధ్రాంగ్ల భాషల్లో స్థిరంగా బాల!

* * *

స్నేహితురాలి తరఫున మధ్యవర్తిగా మనోజ్ దగ్గరికెళ్లి అతనికి విషయమంతా చెప్పింది సుప్రియ.

"ఓ..గాడ్... నిజంగా.." అన్నాడు మనోజ్ తన చెవుల్ని తానే నమ్మలేకపోతూ.

"నిజమే మిస్టర్ మనోజ్! మీ ముఖంలో ఇప్పుడు తాండవిస్తోన్న గెడ్డం కళ దానికి చచ్చేంతగా నచ్చింది. యూ ఆర్ ఎ లక్కీ గై" అంది సుప్రియ నవ్వుతూ!

అంతే!

అసలే వారం రోజుల్నించి తిండిలేక కేవలం ద్రవాహారాలమీదే బతుకుతున్నాడేమో ఆ నీరసం కొద్దీ ఈ ఆనందం కొద్దీ స్పృహ తప్పి పడిపోయాడు మనోజ్!

★